# మార్పు

స్టాఫ్ రూంలోకి అడుగుపెట్టిన విజయలక్ష్మి టీచర్ చేతిలోని పుస్తకం వైపు చూసి 'ఏం నవల టీచర్?' అనడిగాడు కృష్ణమూర్తి సార్.

'పగటి కల' సౌమ్యంగా చెప్పింది.

'ఎవరిది మేడమ్. యండమూరిదా?' సుజాత టీచర్ అడగ్గా నవ్వి 'కాదు... గిజూభాయ్‌ది' అంది.

'డిటెక్టివా మేడమ్?' సైన్సు టీచర్ రాజారాం అడిగాడు. గిజూబాయ్ ఎవరో తెలీని స్థితిలో ఉన్నవాళ్లని చూసి ఆమెకి జాలేసింది.

'ఇది కమర్షియల్ నవల కాదు. ప్రాథమిక పాఠశాలల్లో బోధించబడుతున్న విధానాలు, విషయాలు 'హానికరమైనవని' చెప్పిన ఉపాధ్యాయ నవల. విద్యార్థతలను పరీక్షలతోను, పోటీలతోను, బహుమతులతోనూ కొలిస్తే... వాటి ఫలితాలే పిల్లల మధ్య ఈర్ష్యాద్వేషం, అశాంతి, అసంతృప్తి పెచ్చు పెరుగుతున్నాయని, నూతన విద్యా విధానం కోసం ప్రయోగాలు చేసి రుజువు చేసిన గొప్ప నవల ఇది మన లైబ్రరీలోదే...' అంది.

'రామేశ్వరం పోయిన శనేశ్వరం పోలేదన్నట్లు... మీరు ఇంటి దగ్గర కూడా ఇలాంటి నవల్లే చదువుతారా?' ఆశ్చర్యంగా అడిగారు లెక్కల టీచర్ దేవేందర్ రావు.

'నేనైతే ఇంటి కెళ్ళంతర్వాత బడినే మర్చిపోతాను. హమ్మో బోర్...' అన్నాడు హెడ్మాస్టర్

వెంకటయ్య.

'సరే కాని... ఈనెల చిట్టీ పైసలు ఇయ్యుండ్రి. ఈ నెలల ప్రభాకర్ సారు చిట్టి పాడతానన్నాడు. తిరుపతిరెడ్డి సార్... మీరు పోయిన నెలల చిట్టి పైసలు కట్టలే. నాజేబుల్నించి కట్టుకున్న...' ఇంగ్లీష్ టీచర్ సత్యనారాయణ డబ్బులు వసూలు చేయటంలో మునిగిపోయాడు.

ఆ మాటతో అందరూ చిట్టీల ముచ్చట్లలో పడిపోయారు.

విజయలక్ష్మి మనసు బాధగా మూగవోయింది. కుర్చీలో కూచున్నదల్లా కాసేపటికి తేరుకొని...

'సార్... మన విద్యా వాలెంటీర్ రాలేదా?' అనడిగింది హెచ్.ఎం.ని.

'నెలకి రెండు, మూడుసార్లు వస్తుండు, పోతుండు. గవర్నమెంట్ సరిగా జీతం ఇస్తే మనం వత్తిడి చేసే వాళ్లం. వాళ్లనేమీ అనరాకుండా ఉంది' అన్నాడు నిరాసక్తంగా.

'సరే... లీజర్ పీరియడ్‌లో మూడవ తరగతి తెలుగు నేనే తీస్కుంటున్నాను' అంటూ లేచింది. ఆమాటతో అక్కడే వున్న అటెండర్ పోచయ్య ఓ కుర్చీని టవల్‌తో తుడిచి చెట్ల కింద వున్న 3వ తరగతి పిల్లల ముందు వేసొచ్చాడు.

విజయలక్ష్మి క్లాస్‌కెళ్లింది.

'మన అటెండర్ విజయలక్ష్మి టీచర్‌కైతే ఎక్కడలేని మర్యాదిస్తాడు. ఎందుకో మరి?' అంది జబీనా టీచర్.

'మనమంటే వాడికి మర్యాదే లేదు. నిన్న 'టీ'లు తీసుకురారా అంటే రోజుకి ఎన్నిసార్లు తాగుతారు సార్ అనవట్టే... ఇగేంజెప్పాలే..' అన్నాడు రాజారాం సార్.

'వాడికేం తెల్సు... టీచర్ అంటేనే... టీతాగి చరించేవాడని' అంది సుజాత టీచర్. అంతా నవ్వుకున్నారు.

* * * *

విజయలక్ష్మి పాఠం చెబుతోంది.

'తాటిచెట్టు కల్పవృక్షం... కల్పవృక్షం అనగా అన్ని ఇచ్చునది. తాటికమ్మలు నీడనిస్తాయి. తాటిదూలం ఇళ్లకు పనికి వస్తుంది. తాటిదోనె పొలాలకి నీరు వెళ్లడానికి కాలువలా ఉపయోగపడుతుంది. తాటి ముంజలంటే అందరూ ఇష్టపడతారు. తాటిపండ్లు ఎంతో తియ్యగా వుండును. తాటిచెట్టు వల్ల ఇన్ని లాభాలు ఉన్నాయి కాబట్టి... తాటిచెట్టు మనకి కల్పవృక్షం...' క్లాసంతా నిశ్శబ్దంగా వింటున్నారు.

పాఠం చెబుతూ పిల్లల్ని పరిశీలిస్తున్న విజయలక్ష్మి మోహన్ అనే అబ్బాయి వైపు చూసి ఆగిపోయింది.

ఆ అబ్బాయి మొహంలో కోపం... బాధ... ఎగిసొస్తున్న దు:ఖం... తడిగా మారుతున్న

కళ్లు... ఏవేవో భావ ప్రకంపనలు.

విజయలక్ష్మి పాఠం చెప్పటం ఆపేసి... 'మోహన్... ఏమైనా డౌటా?' అనడిగింది మృదువుగా.

వాడు వెంటనే నిక్కరు పైకి జరుపుకుంటూ లేచి నిల్చుని చేతులు కట్టుకున్నాడు. 'ఏంటి చెప్పు...?'

'తాటిచెట్టు మంచిదా టీచర్? రోజూ మా అయ్య తాటికల్లు తాగొచ్చి మా అమ్మని మస్తు కొడతాడు. తాటిచెట్లతోనే మా అయ్య సెడిపోయిండని మా అమ్మ రోజు ఏడుస్తది.'

పోఖ్రాన్‌లో అణుబాంబు ఎలా పేలిందో కాని... విజయలక్ష్మి గుండెల్లో వాడి ప్రశ్న అణుబాంబులా పేలింది. నిమిషం పాటు నివ్వెరపోయింది. నిజానికి ఆ పాఠంలో... తాటిచెట్టు గురించి రాస్తూ... అసలు 'కల్లు' ప్రస్తావనే రాయలేదు. కాని తాటి చెట్టనగానే ఎవరికైనా గుర్తొచ్చేది 'కల్లే' కదా...

అలాంటి తాటిచెట్టు కల్పవృక్షమవుతుందా...?

వాడు సమాధానం కోసం అలాగే నిల్చున్నాడు.

వాడికేం చెప్పాలి? సంసారాన్ని విచ్ఛిన్నం చేస్తున్న ఒక చెట్టు గురించి వాడు విద్యా వ్యవస్థనే నిలదీసినట్టుందా ప్రశ్న.

మిగతా పిల్లల అమాయకమైన కళ్లల్లో కూడా అవే ప్రశ్నలు!

నిమిషం తర్వాత తేరుకొని... మెల్లిగా, బుజ్జగించినట్టుగా, మృదువుగా సమాధానం చెప్పింది.

* * * *

లంచ్ టైంలో ఈ సమస్యని స్టాఫందరి ముందుచుంది విజయలక్ష్మి.

కొందరు నవ్వారు అదో సమస్యే కాదన్నట్టు మరికొంతమంది తీసేశారు. విజయలక్ష్మి చాలా సీరియస్‌గా అంది.

'డోంట్ థింక్ సిల్లీ... అదొక విద్యార్థి జీవితానికి సంబంధించిన సందేహం'

'ఇంతకీ మీరేం చెప్పారు?' హెచ్.ఎం. అడిగాడు.

'నేను చెప్పింది పూర్తిగా కాకపోయినా, కొంతవరకు కరక్టే అనుకుంటున్నాను. కల్లు తాగటం మంచిదని చెప్పాను. అది కప్పుగాని, అరగ్లాసెడు కాని తాగితే ఏమీకాదు. కాని మీనాన్న చాలా ఎక్కువగా తాగుతున్నాడు. అదే ముప్పు, ఏదైనా అతిగా తిన్నా, అతిగా తాగినా ప్రమాదమే...' అని చెప్పాను.

అందరూ ఆమె సమాధానాన్ని నిశ్శబ్దంగా విన్నారు. అక్కడ అంతకు మించి చెప్పడానికి వేరే ఏం లేదు.

భోజనం ముగిసిన వెంటనే ఆమె కాగితం, కలం తీసుకొని రాయటం మొదలుపెట్టింది.

'లీవ్ లెటరా?' అంది సుజాత టీచర్.

'కాదు... పాఠశాల ఎడ్యుకేషనల్ డైరెక్టర్‌కి లెటర్ రాస్తున్నాను' అంది.

ఆమె వైపు అంతా విచిత్రంగా చూసారు.

*    *    *    *

నెల రోజుల తర్వాత...

విజయలక్ష్మి టీచర్ ఇచ్చిన స్వీట్స్ తింటూ

'మేడమ్... మీ బర్త్‌డేనా?' అన్నారు.

'కాదు'

'మరి మీఎంగేజ్‌మెంట్ అయిఉంటుంది'

'కానే కాదు'

'అడిషనల్ ఇంక్రిమెంట్ సాంక్షన్ అవుతుందని'

'కాదంటే కాదు'

'మరేంటి? స్వీట్స్ పంచేంత విశేషం' అనడిగారంతా.

ఎడ్యుకేషనల్ డైరెక్టర్ నించి. తనకి వచ్చిన లెటర్‌ని వాళ్ల ముందుంచింది. డైరెక్టర్ గారు విజయలక్ష్మిని అబినందిస్తూ... మీలేఖ చదివిన తర్వాత వచ్చే విద్యాసంవత్సరం తాటిచెట్టు పాఠాన్ని తొలగించి ఆ స్థానంలో 'కొబ్బరిచెట్టు' పాఠాన్ని ప్రవేశపెట్టాలని ఆలోచిస్తున్నట్టు, ముందు ముందు మరిన్ని మార్పులు విద్యారంగంలో తేవడానికి తోడ్పడవలసిందిగా రాశాడు.

'ఓస్... దీనికేనా మీరు స్వీట్స్ పంచుతున్నది?' అన్నారు. విజయలక్ష్మి మనసు చివుక్కుమంది. చిన్నబోయింది. బాధగా క్లాస్‌రూం వైపు వెళుతుంటే 'విజయా...' అంటూ వచ్చింది సుజాత టీచర్.

'విజయా నాకన్నా చిన్నదానివైనా అభినందిస్తున్నాను. నీలాగే ఓ ఉపాధ్యాయురాలు ప్రతిజ్ఞలో 'అర్హుడనగుటకై' అనే పదాన్ని... ఆడపిల్లలు ఎలా పలకగలుగుతారు 'అర్హురాలగుటకై' అని వాళ్లకి వర్తించాలి అని ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తే ఆడ, మగ పిల్లలందరూ పలికేలా' అర్హత పొందడానికై సర్వదా నేను కృషి చేయుదును' అని ప్రతిజ్ఞలో మార్చారు. ఈరోజు నువ్వొక పాఠాన్నే మార్పించావ్. ఏనీవే కంగ్రాట్స్. ఇక నించి నేను నీ అడుగుజాడల్లో నడుస్తాను...' అంది.

విజయలక్ష్మి నవ్వింది. చదువులతల్లి నవ్వినంత హుందాగా... సౌమ్యంగా.